క్లుప్తంగా

వితరణ



సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందజేస్తున్న సాధన యూత్ సభ్యులు

పూసపాటిరేగ (నెల్లిమర్ల): నెల్లిమర్ల మండలంలోని గొర్లిపేటలో నూతనంగా నిర్మించిన పైడితల్లి ఆలయానికి జరజాపుపేట సాధన యువజన సంఘ సభ్యులు ఆరు సీలింగ్ ఫ్యాన్లు వితరణగా బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పైడితల్లి అమ్మవారికి సేవ చేయడానికి అవకాశం రావడం సంతోషదాయకమన్నారు కార్యక్రమంలో సాధన యూత్ కమిటీ సభ్యులు పి. దుర్గాప్రసాద్, తుమ్ము ఆశోక్, రాంబాబు, బలరాం, మణికంఠస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు



రక్తం దానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదాతలే ప్రాణదాతలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు.బుధవారం స్థానిక విజయ బ్లడ్‌బ్యాంక్‌లో అబ్దుల్ కలామ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తకొరత లేకుండా నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహించాలన్నారు. మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటి మనిషికి రక్తం ఇచ్చి కాపాడగలడని చెప్పారు. రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, సయ్యద్ తేజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం ప్రారంభం




ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: నగరంలోని తోటపాలెంలో శ్రీసాయి బ్యాడ్మింటన్ స్టేడియంను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ, నూతన హంగులతో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. బ్యాడ్మింటన్ శిక్షణ, టోర్నమెంట్‌లు నిర్వహించుకోవడానికి అనువుగా స్టేడియం ఉందన్నారు. అకాడమీ డైరెక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ, ఈ నెలాఖరులో ఉత్తరాంధ్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించేందుకు అకాడమీ నిర్ణయించిందన్నారు. ఇందుకోసం ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే ప్రహరీ నిర్మించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: తుఫాన్ ధాటికి కూలిపోయిన ఉర్దూ స్కూల్ ప్రహరీని తక్షణమే నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, తుఫాన్ వల్ల మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని ఆబాద్‌వీధిలో గల ఉర్దూ మున్సిపల్ స్కూల్ ప్రహరీ కూలిపోయిందన్నారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

అవగాహన తప్పనిసరి



జాగ్రత్తలపై కొనుగోలుదారులకు వివరిస్తున్న అధికారులు

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి బీవీఎస్. రామ్‌ప్రకాష్ తెలిపారు. బుధవారం స్థానిక డీమార్ట్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగే సందర్భాలలో షాపింగ్ మాల్‌లో గల ప్రజలను త్వరితగతిన ఎలా బయటకు తీసుకురావాలో ప్రాక్టికల్‌గా వివరించారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్ దార్శనికుడు

- జేఎన్‌టీయూ (జీవీ) వీసీ వెంకటసుబ్బయ్య
- వాడవాడలా బాబా సాహెబ్‌కు ఘనంగా నివాళులు



విజయనగరం అర్బన్: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూ సిబ్బంది

విజయనగరం అర్బన్: రాజ్యాంగ రూపశిల్పి, భారతరత్న బాబా సాహెబ్ అంబేడ్కర్ దర్శనికుడని జేఎన్‌టీయూ (జీవీ) వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం యూనివర్సిటీలో అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, దేశ గౌరవాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన అపరమేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.జయసుమ, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.గురునాథ్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏలో..

విజయనగరం అర్బన్: భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత కార్యాలయంలోని అంబేడ్కర్ చిత్రపటానికి డీఆర్‌డీఏ పీడీ ఏ.కల్యాణచక్రవర్తి, పలువురు ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

డెంకాడలో..

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి లైబ్రేరియన్ వై.మహేష్, పాఠకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



భోగాపురం : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ బంగార్రాజు, రెవెన్యూ సిబ్బంది

సరస్వతీపుత్రుడు అంబేడ్కర్

భోగాపురం: అపార మేధావి అంబేడ్కర్ సరస్వతీ పుత్రుడని తహసీల్దార్ చింత బంగార్రాజు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్వోలు రామునాయుడు, ఉషారాణి, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



విజయనగరం: రక్తదానం చేస్తున్న యువత

విజయనగరం: అంబేడ్కర్ వర్ధంతి నేపథ్యంలో నగరంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. విజయనగరం యూత్ ఫౌండేషన్, అమ్మ సేవా సమితి సంయుక్తంగా స్థానిక విజయ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన శిబిరంలో పలువురు యువత స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామాష్, సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, రఘు,విజయ్ , కల్యాణ్, అమ్మ సేవా సమితి అధ్యక్షుడు నాని, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం అర్బన్: నివాళులర్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, తదితరులు



డెంకాడ: శాఖా గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్, పాఠకులు, విద్యార్థులు



విజయనగరం ఫోర్ట్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మురళీమోహన్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

విజయనగరం ఫోర్ట్: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దళిత చైతన్య సేవా సంఘ అధ్యక్షుడు సోము మురళీమోహన్ అన్నారు. స్థానిక లంకాపట్నం రైతు వీధిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేడ్కర్ ప్రసాదించిన రాజ్యాంగం వల్ల నేడు దళితులు అన్ని రాజకీయ పదవులు, ఉద్యోగాలను పొందగలుగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం ఫూల్‌బాగ్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మధు

ఒకటో డివిజన్ పరిధిలో..

విజయనగరం ఫూల్‌బాగ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ముద్దాడ మధు పిలుపునిచ్చారు. నగరంలోని ఒకటవ డివిజన్ పరిధిలో అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బి. భానుమూర్తి, ఎస్. శ్రీను, శంకరమ్మ, కాసులు, అప్పన్న, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు

నగరంలో చైతన్య జీపుయాత్ర



అంబేడ్కర్ జంక్షన్‌లో చైతన్య జీపుయాత్రను ప్రారంభిస్తున్న సాధన సమితి సభ్యులు

విజయనగరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ అందరివాడు సాధన సమితి ఆధ్వర్యంలో నగరంలో బుధవారం చైతన్య జీపుయాత్ర నిర్వహించారు. ముందుగా స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల్లో జీపుయాత్ర ద్వారా అంబేడ్కర్ భారత దేశానికి చేసిన సేవలను వివరిస్తూ ప్రజలను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ బొంగ భానుమూర్తి మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 14తో సమానత్వం.. ఆర్టికల్ 15 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనార్టీలకు విద్యలో రిజర్వేషన్లు.. ఆర్టికల్ 16 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనార్టీలకు ఉద్యోగ అవకాశాలు.. ఆర్టికల్ 340 ద్వారా బీసీ కమిషన్ ఏర్పాటు చేసిన ఘనత అంబేడ్కర్‌దేనని కొనియాడారు. అటువంటి గొప్పవ్యక్తిని అందరూ స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో మల్లన స్వాతి, పూసర్ల మధుసూదనరావు, చిన్న అరుణ్‌కుమార్, మల్లన సంతోష్, సతీష్, రాజ్‌కుమార్, గౌరీస్, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మిగిలి ఉన్న వార్డ్ వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ రెడ్డి శ్రీరాముల నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరంలోని 61 సచివాలయాల పరిధిలో 38 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేయడంలో భాగంగా ఆసక్తి గల యువతీ, యువకుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు స్పందన

భోగాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందని పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి అన్నారు. మండలంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటివెలుగు శిబిరాలలో రిఫరల్స్‌గా గుర్తించిన 20 మందిని ఆపరేషన్ల కోసం బుధవారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య శిబిరాలు ప్రజలకు ఒక వరమని, రిఫరల్‌గా గుర్తించిన ప్రతి ఒక్కరికీ స్వస్థత చేకూరే వరకు పూర్తి బాధ్యత వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అప్తాలిక్ అధికారి మజ్జి గణపతిరావు, సీహెచ్‌ఓ జయకుమారి, ఎంపీహెచ్‌ఈఓ ప్రభాకర్, ఫార్మాసిస్ట్ సత్యనారాయణ, పలువురు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కంటిరోగులతో విశాఖపట్నం బయలుదేరుతున్న వైద్యులు

త్వరితగతిన 'ఆడుదాం ఆంధ్రా' సర్వే



నెల్లిమర్లలో సర్వేని పర్యవేక్షిస్తున్న నగర పంచాయతీ కమిషనర్ బాలాజీప్రసాద్

పూసపాటిరేగ (నెల్లిమర్ల): ఆడుదాం ఆంధ్రా సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్ అన్నారు. నెల్లిమర్ల గాంధీనగర్ సచివాలయం పరిధిలో వలంటీర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను బుధవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వే పూర్తిస్థాయిలో చేపట్టి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. క్రీడా పోటీలకు సమయం తక్కువ ఉండడంతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. 15 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల్లోపు వయస్సు గల వారిని క్రీడలలో ఆడటానికి.. 8 సంవత్సరాలు పైబడిన వారిని క్రీడలు వీక్షించడానికి రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఆయనతో పాటు నగర పంచాయతీ వార్డు సచివాలయాలు సిబ్బంది ఉన్నారు.

అవసరమైన వైద్యసేవలు అందించాలి



ముంజేరులో పాడి రైతులకు సూచనలిస్తున్న జిల్లా పశుసంవర్థక అధికారి విశ్వేశ్వరరావు

భోగాపురం: మండలంలోని పాడి పశువులకు అవసరమైన వైద్య సేవలు, వ్యాక్సినేషన్లు చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఎ. విశ్వేశ్వరరావు, జిల్లా ఉప సంచాలకుడు వై. వెంకటరమణ మండల పశు వైద్యాధికారులకు సూచించారు. మండలంలోని ముంజేరు, కొంగవానిపాలెం, బైరెడ్డిపాలెం గ్రామాలను బుధవారం సందర్శించి పాడి పశువులపై తుఫాన్ ప్రభావం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక సవచాలకుడు వేణుమాధవ్, పశువైద్యశాల ఏరియా సంచాలకుడు ఉమాశంకర్ మహాపాత్రో, పశువైద్యాధికారులు యు. రామరాజు, శ్రీకాంత్, పశుసంవర్ధక శాఖ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీరం దాటిన 'మిచాంగ్'...

- తుఫాన్ ధాటికి విజయనగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం
- సమస్యాత్మక ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన
- గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలు
- పరిశీలించి, నష్టాలను అంచనా వేసిన అధికారులు



జలదిగ్బంధంలో భగవాన్ నగర్ కాలనీ



విజయనగరం: పెద్ద చెరువు నుంచి దిగువకు వస్తున్న వరద నీటి పరిస్థితిని పరిశీలిస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: మిచాంగ్ తుఫాన్ తీరం దాటిన తర్వాత ప్రభావం చూపించింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం వరకు ఏకధాటిగా కురిసిన వర్షంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెద్ద చెరువు దిగువ భాగంలో ఉన్న భగవాన్‌నగర్ ప్రాంతం జల దిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో ఆ ప్రాంతవాసులు రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా పోయింది. పరిస్థితి తెలుసుకున్న అధికార యంత్రాంగం సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది. వర్షం కారణంగా పెద్ద చెరువులోకి భారీగా వరద నీరు చేరడంతో చెరువులో నీటిని కిందకు విడిచిపెట్టడంతో సమస్య తలెత్తినట్లు అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల్లో వరద నీటి సమస్య లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా నగరంలోని అబాద్‌వీదిలో గల ఉర్దూ పాఠశాల ప్రహరీ నేలకూలింది. ఆ సమయంలో పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. అదేవిధంగా విజయనగరం మండలంలోని పలు గ్రామాల్లో వరి చేను వరద నీటికి తడిసిముద్దయింది.

కమిషనర్ పర్యటన..

మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో నగరంలోని అక్కడక్కడ ఏర్పడిన ప్రతికూల పరిస్థితులను కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. వర్షపు నీరు అధికంగా ప్రవహిస్తున్న ప్రధాన కాలువలను పరిశీలించారు. ముఖ్యంగా ట్యాంక్ బండ్ రోడ్డు, భగవాన్ నగర్, ధర్మపురి వంటి ప్రాంతాలలో కాలువలను గమనించి వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. ట్యాంక్‌బండ్ రోడ్డు వద్దనున్న ప్రధాన కాలువలో గుర్రపుడెక్కను జేసీబీల సహాయంతో అప్పటికప్పుడు తొలగించారు. అలాగే అంబేడ్కర్ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ వరకు డివైడర్ల మధ్యలో రెండు చెట్లు నేలకొరగడంతో వాటిని తీసివేయించారు. ఆయన వెంట నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ ఈఈ దక్షిణామూర్తి, డీఈ అప్పారావు, పారిశుధ్య పర్యవేక్షకులు అంజిబాబు, రవిశేఖర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన..

పూసపాటిరేగ (నెల్లిమర్ల) : నెల్లిమర్ల మండలంలోని పలు గ్రామాల్లో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నీటి మునిగిన వరిపంటను మండల వ్యవసాయ అధికారి ఎం. పూర్ణిమ పరిశీలించారు. చంద్రంపేట, ఎల్‌ఎస్ పురం, కొండ వెలగాడ, కొండగుంపాం గ్రామాలలో నీటి మునిగిన వరి పంటను పరిశీలించి, నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. లీటర్ నీటిలో ఐదు గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే నెల్లిమర్ల మిమ్స్ సమీపంలో గల మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే గురుకుల కళాశాల ప్రహరీ కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ రామారావు, ఎంఈఓలు సూర్యనారాయణ, విజయ్‌కుమార్ కూలిన గోడను పరిశీలించారు.



పూసపాటిరేగ: నెల్లిమర్ల మండలం కొండగుంపాంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి పూర్ణిమ, తదితరులు



పూసపాటిరేగ: కుమిలిలో రైతులతో మాట్లాడుతున్న ఎ.డి నాగభూషణరావు, శాస్త్రవేత్తలు అనురాధ, తేజేశ్వరరావు, తదితరులు



పూసపాటిరేగ: నెల్లిమర్ల మిమ్స్ సమీపంలో కూలిన జ్యోతిబాపూలే గురుకులం ప్రహరీ



డెంకాడ: పినతాడివాడ నీట మునిగిన వరి పనలను వీఆర్‌ఓ సునీతకు చూపిస్తున్న రైతు

నష్టం లేకుండా చూడండి..

పూసపాటిరేగ: వరి రైతులకు నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ ఎ.డి నాగభూషణరావు అన్నారు. మండలంలోని కుమిలి, చల్లవానితోట గ్రామాలలో తడిసిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఆయనతో పాటు డాట్ ప్రధానశాస్త్రవేత్త అనురాధ, శాస్త్రవేత్త తేజేశ్వరరావు, వ్యవసాయ అధికారి కె. నీలిమ, తదితరులున్నారు.

డెంకాడలో..

డెంకాడ: తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా విస్తారంగా కురిసిన వర్షాలకు వరి పంట దెబ్బతింది. ఏఓ పూడి నిర్మల గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు. మండల వ్యాప్తంగా సుమారు 503 ఎకరాల్లో వరి పంట నష్టపోయిందిని చెప్పారు. అలాగే ఐదు ఎకరాల్లో మొక్కజొన్న, రెండున్నర ఎకరాల్లో అరటి పంటలు దెబ్బతిన్నాయన్నారు.

వినతి

విజయనగరం ఫూల్‌బాగ్: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి. పైడిరాజు, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్మోహన్, బి. రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని గాజులరేగ, ఫూల్‌బాగ్, అయ్యన్నపేట, బీసీ కాలనీ, ద్వారపూడి, ప్రశాంతినగర్, తదితర చోట్ల ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభ, ప్రసన్న, విశాలక్ష్మి, శివలక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.